భారత్‌తో కెనడా కయ్యం

మరోసారి తెరపైకి నిజ్జర్ హత్య కేసు

- భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్‌ను అనుమానితుడిగా పేర్కొన్న ట్రూడో సర్కారు
- కెనడా ప్రభుత్వానివి అసంబద్ధ ఆరోపణలు.. ఓటు బ్యాంకు రాజకీయాలని భారత్ ధ్వజం
- కెనడా నుంచి దౌత్యవేత్తల ఉపసంహరణ
- ఆరుగురు కెనడా దౌత్యవేత్తల బహిష్కరణ

సంజయ్‌కుమార్

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: భారత్ - కెనడా మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. గత జూన్‌లో కెనడాలోని సర్రేలో జరిగిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో అక్కడి భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మతో పాటు పలువురు దౌత్యవేత్తలను అనుమానితులు(పర్సన్స్ ఆఫ్ ఇంట్రెస్ట్)గా కెనడా పేర్కొన్నది. ఈ మేరకు ఆదివారం భారత విదేశాంగ శాఖకు దౌత్యపరమైన సమాచారాన్ని పంపింది. కెనడా తీసుకున్న ఈ అసాధారణ చర్యతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తలెత్తాయి. కెనడా తీరుపై భారత్ తీవ్రంగా స్పందించింది. భారత్‌లోని ఆ దేశ రాయబారికి సమన్లు ఇవ్వడంతో పాటు కెనడా లక్ష్యంగా చేసుకున్న భారత దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించింది.

దౌత్యవేత్తలను ఉపసంహరించుకున్న భారత్

కెనడాలోని భారత హైకమిషనర్‌తో పాటు ఆ దేశం లక్ష్యంగా చేసుకున్న దౌత్యవేత్తలు, అధికారులను వెనక్కు పిలిపించాలని భారత ప్రభుత్వం సోమవారం నిర్ణయించింది. నిరాధార ఆరోపణలతో వారిని లక్ష్యంగా చేసుకొవడం సరికాదని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. అతివాదం, హింసాత్మక వాతావరణంలో ట్రూడో సర్కారు చర్యలు వారి భద్రతను ప్రమాదంలోకి నెట్టాయని ఆరోపించింది. వారి భద్రత విషయంలో ప్రస్తుత కెనడా ప్రభుత్వ నిబద్ధతపై నమ్మకం లేదని, కాబట్టి వారిని ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్టు పేర్కొన్నది. ఈ విషయాన్ని భారత్‌లోని కెనడా యాక్టింగ్ హైకమిషనర్ స్టీవార్ట్ వీలర్‌కు తెలిపింది. అంతకుముందు ఆయనకు భారత విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. కాగా, నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్రపై విశ్వసనీయ, తిరుగులేని ఆధారాన్ని అందించినట్టు స్టీవార్ట్ పేర్కొన్నారు.

ఆరుగురు కెనడా దౌత్యవేత్తల బహిష్కరణ

ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను భారత విదేశాంగ శాఖ బహిష్కరించింది. స్టీవార్ట్ వీలర్‌తో పాటు డిప్యూటీ హైకమిషనర్ పాట్రిక్ హెబర్ట్, ఫస్ట్ సెక్రటరీలు మారీ కాథెరీన్ జోలీ, ఐయాన్ రాస్ డేవిడ్ ట్రైట్స్, అడమ్ జేమ్స్ చుయిప్క, పౌలా అర్జూలాను బహిష్కరిస్తున్నట్టు ఒక ప్రకటన విడుదల చేసింది. వీరు 19వ తేదీ నాటికి భారత్‌ను వీడాలని ఆదేశించింది. కాగా, భారత్ చర్యకు ప్రతిస్పందనగా కెనడా సైతం ఆరుగురు భారత దౌత్యవేత్తలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్టు అక్కడి మీడియా పేర్కొన్నది. ఈ ఆరుగురు దౌత్యవేత్తలకు నిజ్జర్ హత్యకేసుతో సంబంధాలు ఉన్నట్టు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసుల వద్ద ఆధారాలు ఉన్నాయని ఓ అధికారిని ఉటంకిస్తూ తెలిపింది.

కెనడావి ఓటు బ్యాంకు రాజకీయాలు

కెనడా ప్రభుత్వం చేసిన ఆరోపణపై భారత్ తీవ్రస్థాయిలో మండిపడింది. జస్టిన్ ట్రూడో ప్రభుత్వం ఓ రాజకీయ ఎజెండాతో ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతున్నదని, అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత్‌కు వ్యతిరేకంగా అతివాదం, హింస, వేర్పాటువాదానికి మద్దతు ఇస్తున్న ట్రూడో ప్రభుత్వ చర్యలకు ప్రతిస్పందనగా తదుపరి చర్యలు తీసుకునేందుకు ఇప్పుడు భారత్‌కు హక్కు ఉందని స్పష్టం చేసింది. నిజ్జర్ హత్యకు సంబంధించి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గత ఏడాది సెప్టెంబర్‌లోనే భారత్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు చేశారని, కానీ ఇంతవరకు ఎటువంటి ఆధారాలను తమతో పంచుకోలేదని తెలిపింది. విచారణ పేరుతో భారత్‌ను బదనాం చేసి రాజకీయ ప్రయోజనాలు పొందే వ్యూహాన్ని ట్రూడో అమలు చేస్తున్నట్టు సందేహం ఉందని పేర్కొన్నది. భారత్‌కు వ్యతిరేకంగా అతివాద, వేర్పాటువాద అజెండాకు బహిరంగంగా మద్దతు ఇస్తున్న వ్యక్తులు ట్రూడో క్యాబినెట్‌లో ఉన్నారని ఆరోపించింది. భారత్‌కు వ్యతిరేకంగా వేర్పాటువాదాన్ని సమర్థిస్తున్న వ్యక్తి నాయకత్వంలోని రాజకీయ పార్టీపై ట్రూడో ప్రభుత్వం ఆధారపడి ఉందని పేర్కొన్నది.

ఇజ్రాయెల్ ఆర్మీ బేస్‌పై హెజ్బొల్లా దాడి

- నలుగురు జవాన్ల దుర్మరణం
- 60 మందికిపైగా గాయాలు
- ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ హలేవి మృతి చెందినట్టు వార్తలు
- ఖండించిన ఇజ్రాయెల్ సైన్యం

డీర్ అల్ బలా: సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని ఆర్మీ బేస్‌పై హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్ డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. ఈ దాడిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. 60 మందికిపైగా గాయపడ్డారు. దాడిలో ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలేవి మరణించినట్టు తొలుత వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను ఐడీఎఫ్ ఖండించింది. బీరుట్‌లో గురువారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 22 మంది మరణించారు. దానికి ప్రతీకారంగానే ఈ డ్రోన్ దాడి జరిపినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. అయితే తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ఈ డ్రోన్ ఎలా తప్పించుకున్నదో దర్యాప్తు చేస్తున్నామని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. హెజ్బొల్లా ప్రయోగించిన డ్రోన్ మిర్వాద్-1 రకానికి చెందినదిగా భావిస్తున్నారు. గంటకు 370 కిలోమీటర్ల వేగంతో 120 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఇది చేధించగలదు. భారీ సంఖ్యలో రాకెట్లతో కలిపి హెజ్బొల్లా ఈ డ్రోన్లను ప్రయోగించడంతో ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ వీటిని అడ్డుకోలేకపోయిందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు, గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో సుమారు 20 మంది మరణించినట్టు అధికారులు తెలిపారు.

ఇజ్రాయెల్ చేతికి థాడ్

ఇజ్రాయెల్‌కు అమెరికా అధునాతన యాంటీ మిస్సైల్ సిస్టమ్ 'థాడ్'ను అందజేయనుంది. అమెరికా వద్దనున్న అధునాతన మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్‌లో థాడ్ ఒకటి. బాలిస్టిక్ మిస్సైల్స్‌ను అడ్డుకునే సామర్థ్యం దీనికి ఉన్నది.

డారెన్ ఏస్‌మోగ్లు

సైమన్ జాన్సన్

జేమ్స్ ఏ రాబిన్సన్

అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఏ రాబిన్సన్‌కు అవార్డు
- దేశాల మధ్య ఆర్థిక అంతరాలపై పరిశోధనలకు వరించిన పురస్కారం

స్టాక్‌హోం, అక్టోబర్ 14: ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది కూడా ముగ్గురిని నోబెల్ బహుమతి వరించింది. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పనిచేస్తున్న డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్‌తోపాటు షికాగో యూనివర్సిటీలో పరిశోధన నిర్వహిస్తున్న జేమ్స్ ఏ రాబిన్సన్ ఈసారి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. చట్టబద్ధ పరిపాలన లేని సమాజాలు, ప్రజలను దోచుకునే వ్యవస్థలు స్థిరంగా ఎందుకు వృద్ధి చెందలేవన్న అంశంపై పరిశోధన నిర్వహించినందుకు వీరు ఈ పురస్కారానికి ఎంపికైనట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆదాయ పరంగా దేశాల మధ్య ఉన్న భారీ అసమానతలను తగ్గించడం మన ముందున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటని, ఆ లక్ష్యాన్ని సాధించడంలో సామాజిక వ్యవస్థల ప్రాముఖ్యత ఏమిటన్న విషయాన్ని ఈ ముగ్గురు పరిశోధకులు తెలియజెప్పారని నోబెల్ పురస్కార కమిటీ చైర్మన్ జాకబ్ సెవెన్‌సన్ పేర్కొన్నారు. చట్టాలను సక్రమంగా పాటించని సమాజాలు, ప్రజలను దోచుకునే వ్యవస్థలున్న దేశాలు అభివృద్ధిలో ఎందుకు విఫలమవుతాయో లోతుగా తెలుసుకునేందుకు వీరి పరిశోధన ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. కాగా, నిరుడు కూడా అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి లభించింది. బ్యాంకులు, ఆర్థిక సంక్షోభాలపై పరిశోధన చేసిన బెన్ ఎస్ బెర్నాంకీ, డగ్లస్ డబ్ల్యూ డైమండ్, ఫిలిప్ హెచ్ దిబ్విగ్ ఈ పురస్కారాన్ని గెలుచుకున్నారు.

పాంగాంగ్ వద్ద చైనా నిర్మాణాలు

ఉపగ్రహ చిత్రాల్లో గుర్తింపు

న్యూఢిల్లీ: భారత్, చైనా ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి దౌత్య పరమైన ప్రయత్నాలు కొనసాగిస్తుంటే, మరో పక్క పాంగాంగ్ త్సో సరస్సు ఉత్తర తీరానికి దగ్గర్లో చైనా భారీగా నిర్మాణాల్ని చేపట్టింది. ఇండియా టుడే సమీక్షించిన తాజా ఉపగ్రహ చిత్రాల్లో ఈ విషయం వెల్లడైంది. ఈ నిర్మాణాలు భారత్-చైనా దళాల 2020 స్టాండ్‌ఆఫ్ పాయింట్స్‌కు తూర్పున సుమారుగా 38 కిలోమీటర్ల దూరంలో భారత ప్రాదేశిక భూ భాగానికి అవతలి వైపు ఉన్నాయి. పాంగాంగ్ సరస్సు భారత్-చైనా పాలిత టిబెట్ మధ్య వివాదాస్పద సరిహద్దుగా ఉన్నది. తక్షశిల ఇన్‌స్టిట్యూషన్ ప్రొఫెసర్ నిత్యానందం ప్రకారం.. 100కు పైగా భవనాల నిర్మాణం అక్కడ కొనసాగుతున్నది. హెలికాప్టర్ ఆపరేషన్ల కోసం దీర్ఘ చతురస్రాకార స్ట్రిప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఎత్తయిన శిఖరాల వెనుక జరుగుతున్న ఈ నిర్మాణాలు వ్యూహాత్మక ప్రయోజనాన్ని కలిగి ఉంటాయని నిత్యానందం విశ్లేషించారు. ఒకవేళ ఆ ప్రాంతాన్ని సైనిక అవసరాల కోసం ఉపయోగిస్తే.. అది చైనా దళాల ప్రతిస్పందన సమయాన్ని తగ్గిస్తుందని భారత మిలటరీ అంచనా వేసింది.

పాంగాంగ్ సరస్సు సమీపంలో చైనా చేపట్టిన నిర్మాణాలు

అనారోగ్యంతో ఉంటే బెయిల్ ఇవ్వొచ్చు

పీఎంఎల్‌ఏ నిబంధనలు కఠినంగా ఉన్నా సరే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) నిబంధనలు ఎంత కఠినంగా ఉన్నప్పటికీ అనారోగ్యంతో ఉన్న వారికి బెయిల్ మంజూరు చేయాల్సిన అవసరం ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొన్నది. మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసిన సేవా వికాస్ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ అమర్ సాధురామ్ ముల్చందని బెయిల్ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జేబీ పార్దివాలా ధర్మాసనం విచారించింది. 'పీఎంఎల్‌ఏ ఎంత కఠినమైనప్పటికీ మేం చట్టానికి లోబడి నడుచుకోవాలి. ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వారికి బెయిల్ ఇవ్వొచ్చు.' అని కోర్టు పేర్కొన్నది. ముల్చందనికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

భరూచ్‌లో హై టెన్షన్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని భరూచ్‌లో ఆదివారం దుర్గ విగ్రహ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా చెలరేగిన హింస ఉద్రిక్తతలను రాజేసింది. ఈ ఘర్షణలో ఒక యువకుడు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. పోలీసులు 30 మందిని అదుపులోనికి తీసుకున్నారు. భరూచ్ ఎస్పీ కథనం ప్రకారం మహారాజ్ గంజ్‌లో విగ్రహ ఊరేగింపు సందర్భంగా ఉపయోగించిన లౌడ్ స్పీకర్ల విషయమై ఘర్షణ తలెత్తింది. ఈ సందర్భంగా రెండు వర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకొని, తూటాలు పేల్చుకొన్నాయి. ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో గాయపడిన ఓ యువకుడు దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన తర్వాత ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఆందోళనకారులు సోమవారం పలు దుకాణాలకు, వాహనాలకు, ఒక దవాఖానకు, బైక్ షోరూమ్‌కు నిప్పు పెట్టారు.

కెన్యాలో మోదానీ సెగలు!

- ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు గుజరాత్‌లో పర్యటించా
- అదానీ కంపెనీల గురించి మోదీ ప్రత్యేకంగా వివరించారు
- 'అదానీ-మోదీ' బంధంపై కెన్యా మాజీ ప్రధాని ఒడింగా
- అదానీ ఒప్పందాలపై వివాదం వేళ కీలక విషయం వెల్లడి
- మోదానీ బంధం మరోసారి బహిర్గతమైందన్న ప్రతిపక్షం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీల ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ దౌత్య సంబంధాలను సైతం వాడారన్న విమర్శల నేపథ్యంలో మరో సంచలన విషయం బయటకు వచ్చింది. ప్రధాని మోదీ గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను ఆ రాష్ట్రంలో ప్రధాని హోదాలో పర్యటించినట్టు కెన్యా మాజీ ప్రధాని రాయిలా ఒడింగా పేర్కొన్నారు. మోదీ ఆహ్వానం మేరకే తాను, తన దౌత్య సిబ్బంది ఆ రాష్ట్రంలో పర్యటించినట్టు వెల్లడించారు. ఈ పర్యటనలో అదానీ గ్రూప్ కంపెనీలకు చెందిన పోర్ట్, పవర్ ప్లాంట్, రైల్వే లైన్, ఎయిర్‌స్ట్రిప్ తదితర ప్రాజెక్టులను మోదీ ప్రత్యేకంగా చూపించి విశేషాలను తెలియజెప్పారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఒడింగా మాట్లాడిన ఓ వీడియోను ప్రముఖ జర్నలిస్ట్ రావి నాయర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మోదానీ (మోదీ-అదానీ) బంధం మరోసారి బహిర్గతమైందంటూ కాంగ్రెస్ నేతలు విమర్శించారు.

కెన్యాలో నిరసనలు

ఏఎల్‌జీ అనే స్థానిక సంస్థ మెరుగైన ప్రతిపాదనను పక్కనబెట్టి మరీ అదానీ కంపెనీకే దేశంలోని నైరోబీ ఎయిర్‌పోర్టు విస్తరణ, నిర్వహణ పనులను ప్రభుత్వం అప్పగించడంపై కెన్యా పౌరులు తీవ్రంగా మండిపడ్డారు. దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సర్వత్రా ఒత్తిళ్లు పెరుగడంతో ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని కెన్యా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కెన్యా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ(కేఏఏ)ని కెన్యా జాతీయ అసెంబ్లీ ప్రజా పెట్టుబడుల కమిటీ ఆదేశించింది. టెండరు ప్రక్రియపై ప్రత్యేక ఆడిట్ జరిపే వరకు అదానీ గ్రూప్‌తో తదుపరి ప్రక్రియలను నిలిపివేయాలని సూచించింది. కాగా ఈ డీల్‌ను ఒడింగా సమర్థించడం విమర్శలకు తావిచ్చింది. మరోవైపు, అదానీ కంపెనీతో విమానాశ్రయ డీల్‌ను రద్దు చేసుకొన్న కెన్యా సర్కారు.. విద్యుత్తు లైన్ల ఏర్పాటు, కరెంటు సరఫరా కోసం 30 ఏండ్లకు గానూ అదే అదానీ గ్రూప్ కంపెనీతో తాజాగా మరో ఒప్పందం చేసుకోవడం విమర్శలకు దారితీస్తున్నది.

లంకలోనూ అలాగే

శ్రీలంకలోని మన్నార్ జిల్లాలో నిర్మించ తలపెట్టిన 500 మెగావాట్ల విండ్ పవర్‌ప్లాంటును పోటీ లేకుండా అదానీ గ్రూప్‌నకు కట్టబెట్టారన్న విమర్శలు ఉన్నాయి. అదానీ కంపెనీకి లబ్ధి చేకూర్చే ఈ డీల్ కోసం భారత ప్రధాని మోదీ, అప్పటి శ్రీలంక అధ్యక్షుడు గొటబయ రాజపక్సపై ఒత్తిడి తెచ్చారని ఆ దేశ విద్యుత్తు సంస్థ అధ్యక్షుడిగా పనిచేసిన ఫెర్డినాండో 2022లో బయటపెట్టారు. కాగా పోటీ లేకపోవటంతో అదానీ గ్రూప్‌నకు 25 ఏండ్లలో 4 బిలియన్ అమెరికన్ డాలర్ల అయాచిత లాభం చేకూరుతుందని శ్రీలంక ఇంజినీర్లు తేల్చిచెప్పారు. ఇది దేశానికి ఆర్థిక భారమేనని పేర్కొన్నారు. ఈ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని పెద్దయెత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో గత ప్రభుత్వ పెద్దలతో అదానీ గ్రూప్ లోపాయికారి ఒప్పందాలపై అనూరకుమార దిస్సనాయకే నేతృత్వంలోని శ్రీలంక కొత్త ప్రభుత్వం పునఃసమీక్షించనున్నట్టు ప్రకటించింది.

లైట్ మోటార్ వాహనాలకు టోల్ ఫీజు రద్దు

అసెంబ్లీ ఎన్నికల ముందు మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

ముంబై: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోకి ప్రవేశించే లైట్ మోటార్ వాహనాలకు టోల్ ఫీజును రద్దుచేస్తున్నట్టు ప్రకటించింది. సోమవారం అర్ధరాత్రి నుంచే ఇది అమల్లోకి వచ్చింది. కార్లు (హ్యాచ్‌బ్యాక్స్, సెడాన్లు, ఎస్‌యూవీలు), జీపులు, వ్యాన్లు, ఆటో రిక్షాలు, ట్యాక్సీలు, డెలివరీ వ్యాన్లు, చిన్నపాటి ట్రక్కులకు ఇది వర్తిస్తుంది.

వక్ఫ్ బిల్లు సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన విపక్షం

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: వక్ఫ్(సవరణ) బిల్లును సమీక్షిస్తున్న పార్లమెంటరీ కమిటీ సమావేశాన్ని సోమవారం పలువురు విపక్ష ఎంపీలు బహిష్కరించారు. వక్ఫ్ భూముల స్కామ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మరికొందరు నేతల ప్రమేయం ఉందని బీజేపీ నేత, కర్ణాట స్టేట్ మైనారిటీస్ కమిషన్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల మాజీ చైర్మన్ అయిన అన్వర్ మనిప్పడి ఆరోపించడంతో విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై బీజేపీ, విపక్ష ఎంపీల మధ్య మాటల యుద్ధం జరిగింది.

బిష్ణోయ్ గ్యాంగ్‌లో 700 మంది షూటర్లు

- జైల్లో ఉన్న లారెన్స్ ఫోన్ ఆదేశాలతో టార్గెట్లు పూర్తి
- పేదలు, దారి తప్పిన యువకులతో ముఠా నిర్వహణ

ముంబై, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): ఎన్సీపీ(అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత బాబా సిద్ధిఖీ హత్యతో లారెన్స్ బిష్ణోయ్ ముఠా పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఈ గ్యాంగ్ పనితీరు చర్చకు వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం లారెన్స్ బిష్ణోయ్ ముఠాలో 700 మందికి పైగా షూటర్లు ఉంటారు. ఈ ముఠా స్థానిక గ్యాంగ్ స్టర్ల సాయంతో షూటర్లను అద్దెకు తీసుకొని వారికి ఆయుధ శిక్షణ ఇచ్చి వారి చేత హత్యలు చేయిస్తూ వారికి బాగా డబ్బు ముట్టచెప్తుంది. ఈ ముఠాలో ఎక్కువగా పేదలు, బాలలు, దారి తప్పిన యువకులు ఉంటారు. గతంలో పంజాబ్‌కే పరిమితమైన లారెన్స్ ముఠా నేరాలు ప్రస్తుతం ఉత్తరాదిలోని 12 రాష్ట్రాలకు విస్తరించింది. కెనడా, పాకిస్థాన్, దుబాయ్, అమెరికా దేశాల్లోనూ ఈ ముఠాకు నెట్‌వర్క్ ఉంది. ఈ ముఠాకు ఖలీస్థాని ఉగ్రవాదులతోనూ, ఖలీస్థానీ వేర్పాటు వాద గ్రూపులతోనూ సంబంధాలు ఉన్నాయి. ఈ మఠాకు లాజిస్టిక్, న్యాయ వ్యవహారాలు, సమాచార సేకరణకు ప్రత్యేక విభాగాలు ఉన్నాయి.

లారెన్స్ జైల్లో ఉన్నా మొబైల్ ఫోన్ సాయంతో ముఠా సభ్యులతో మాట్లాడుతుంటాడు. దేశ, విదేశాల్లోని తన అనుచరులతో కమ్యూనికేషన్ కోసం సిగ్నల్, టెలిగ్రామ్ లాంటి యాప్‌లు కూడా వినియోగిస్తుంటాడు. లారెన్స్ బిష్ణోయ్ ముఠా పంజాబీ గాయకులు, లిక్కర్ మాఫియా, డ్రగ్ ట్రాఫికర్లు, ప్రముఖ వ్యాపారులను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడుతుంది. దోపిడీలు, హత్యలు, ఆయుధాల స్మగ్లింగ్ లాంటి నేరాల్లో ఈ గ్యాంగ్ ప్రమేయం క్రమంగా పెరుగుతూ వస్తున్నది. 2014లో లారెన్స్ మొదటిసారి అరెస్టయినప్పుడు పోలీస్ కస్టడీ నుంచి తప్పించుకొని నేపాల్ పారిపోయాడు. ఆ తర్వాత 2016లో అరెస్టై అప్పటి నుంచి గుజరాత్‌లోని సబర్మతి జైల్లోనే ఉన్నాడు. 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిధూ మూసే వాలా హత్యతో లారెన్స్ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాడు. లారెన్స్‌పై హత్య, దోపిడీ తదితర నేరాలకు సంబంధించి రెండు డజన్ల కేసులున్నాయి. నేరాలు చేయడంలో లారెన్స్ ముఠాకు, దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌కు పోలికలున్నాయని పోలీసులు చెప్తారు. లారెన్స్ ముఠా కార్పొరేట్ కంపెనీ తరహాలో పనిచేస్తుందని తెలిపారు.

సల్మాన్ ఖాన్ ఎందుకు టార్గెట్ అయ్యారు?

బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ 1998లో కృష్ణ జింకలను వేటాడారు. దీనిపై కేసు నడుస్తున్నది. కృష్ణ జింకలను బిష్ణోయ్ వర్గం పవిత్రంగా భావిస్తారు. ఇదే వర్గానికి చెందిన లారెన్స్‌కు సల్మాన్ ఖాన్ జింకల వేట నచ్చలేదు. దీంతో 2018 నుంచి సల్మాన్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ ముఠా పని చేస్తున్నది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆయన ఇంటిపై కాల్పులు జరిపింది. అంతకు ముందు ఆయన ఫామ్ హౌస్ వద్ద రెక్కీలు నిర్వహించింది. సుమారు 25 మంది సల్మాన్ ఖాన్‌పై దాడికి సిద్ధమవుతున్నారని ఇంటెలిజెన్స్ గుర్తించింది.

హిట్ లిస్ట్‌లో ఇంకా ఎవరున్నారు?

ఎన్ఐఏ దర్యాప్తు సమయంలో తన హిట్ లిస్ట్‌లో ఎవరున్నారో లారెన్స్ వెల్లడించారు. దాని ప్రకారం బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నారు. బిగ్ బాస్ 17 విజేత మునావర్ ఫారూఖీ, గాయకుడు సిధూ మూసే వాలా మేనేజర్ షగన్‌ప్రీత్ సింగ్, బాబా సిద్ధిఖీ కుమారుడు జీషాన్ సిద్ధిఖీ, గ్యాంగ్‌స్టర్ కౌశల్ చౌదరి ఈ జాబితాలో ఉన్నారు.

కోడి ముందా? గుడ్డు ముందా?

శాస్త్రవేత్తల సమాధానం ఏమిటంటే..

న్యూయార్క్, అక్టోబర్ 14: కోడి ముందా? గుడ్డు ముందా? స్కూల్ పిల్లల నుంచి మొదలుపెడితే ప్రఖ్యాత శాస్త్రవేత్తల వరకు యావత్తు మానవాళిని వేధించే ప్రశ్న ఇది. ఈ ప్రశ్నకు శాస్త్రవేత్తలు ఎట్టకేలకు సమాధానం కనుగొన్నారు. కోడి కంటే గుడ్లే ముందు తయారయ్యాయని, భూమిపై జీవం ఆవిర్భవించిన సమయంలోనే గుడ్లు సైతం ఏర్పడ్డాయని చెప్పారు. అయితే, ఇవి కోడి గుడ్లు కావట. 60 కోట్ల సంవత్సరాల క్రితం మొదటిసారి గుడ్లు ఏర్పడ్డాయని, అప్పట్లో పాలిచ్చే జంతువులూ గుడ్లు పెట్టేవని చెప్తున్నారు. ఇప్పటి గుడ్లతో పోలిస్తే అప్పటి గుడ్లు చాలా భిన్నంగా ఉండేవని, చాలా చిన్నగా, మనిషి వెంట్రుకల కంటే తక్కువ మందంగా ఉండేవని భావిస్తున్నారు. ఇక కోళ్ల సంగతికి వస్తే.. దాదాపు 5 కోట్ల ఏండ్ల క్రితం గల్లస్ గల్లస్ అనే ఎర్ర అడవి జాతి పక్షుల నుంచి రూపాంతరం చెందాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఇప్పుడు ఉన్న దేశీయ కోళ్లు మాత్రం దాదాపు 10 వేల ఏండ్ల క్రితం ఉద్భవించాయని గతంలో శాస్త్రవేత్తలు ఓ పరిశోధన ద్వారా గుర్తించారు. కాబట్టి, కోడి ముందా? గుడ్డు ముందా ? అని అడిగితే గుడ్డే ముందని చెప్పవచ్చని, కానీ కోడిగుడ్డు కంటే మాత్రం కోడి ముందు అని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఎర్ర అడవి జాతి పక్షి పెట్టిన గుడ్ల నుంచి ఇప్పుడున్న కోళ్లు పుట్టాయి. ఆ తర్వాత కోళ్లు గుడ్లు పెట్టాయి. కాబట్టి ఇప్పటి గుడ్ల కంటే ముందే కోడి జన్మించినట్టు అర్థం చేసుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు.

కలలోనూ 'కబుర్లు'

నిద్రలో మాట్లాడుకున్న ఇద్దరు • అమెరికాలో అరుదైన ప్రయోగం సక్సెస్

కాలిఫోర్నియా, అక్టోబర్ 14: కలలో ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకోగలరా? ఏం మాట్లాడుకున్నారో మెలకువ వచ్చాక గుర్తుపెట్టుకోగలరా? ఇలాంటివి సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో కాకుండా నిజజీవితంలో సాధ్యమా? అంటే అవుననే అంటున్నది అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన 'ఆర్ఈఎంస్లీప్' అనే అంకుర సంస్థ. ఇద్దరు మనుషులు నిద్రలోనే మాట్లాడుకునేలా తాము చేపట్టిన ప్రయోగం విజయవంతమైందని ఈ సంస్థ ప్రకటించింది. సెప్టెంబర్ 24న జరిగిన ఈ ప్రయోగం వివరాలను ఈ సంస్థ తాజాగా వెల్లడించింది.



ప్రయోగం జరిగిందిలా...

ముందుగా ఇద్దరు వ్యక్తులు వేర్వేరు ఇండ్లలో నిద్రపోయారు. వీరికి సర్వర్, వైఫైతో అనుసంధానమై ఉన్న సెన్సార్‌తో కూడిన పరికరాలను అమర్చారు. మొదటి వ్యక్తి కలలోకి జారుకున్న విషయాన్ని మెదడు తరంగాలను ట్రాక్ చేసి ఈ పరికరం గుర్తించింది. ఈ విషయాన్ని సర్వర్‌కు చేరవేసింది. తర్వాత సర్వర్ 'రెమ్మో' అనే విభిన్న భాష న